సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 5 । జూన్ । 2025



'నవోదయ'ం పిలుస్తోంది..!
కాగజ్‌నగర్‌లోని నవోదయలో 6వ తరగతిలో ప్రవేశాలకు గాను దరఖాస్తులకు వేళయింది. జూలై 17 వరకు గడువు ఉంది.
12లో▸



పర్యావరణమే పరమౌషధం!
నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రకృతి పరిరక్షణకు పాటుపడుతున్న పలువురిపై ప్రత్యేక కథనం.
12లో▸

గరిష్టం/కనిష్టం
34.0/25.0

వాతావరణం
చాలా వరకు ఎండగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

నాగ్‌పూర్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీస్

ఆదిలాబాద్: జిల్లావాసుల సౌకర్యార్థం ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి ప్రతిరోజు మహారాష్ట్రలోని నాగపూర్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీస్ నడపనున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు ఆదిలాబాద్ నుంచి సాయంత్రం 4 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుందని వివరించారు. అలాగే అక్కడి నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి 10 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ సర్వీస్ గురువారం ప్రారంభమవుతుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీవైఎస్‌వోగా శ్రీనివాస్ బాధ్యతలు



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న క్రీడా సంఘాల బాధ్యులు

ఆదిలాబాద్: డీవైఎస్‌వో (ఇన్‌చార్జి)గా తాంసి జెడ్పీ హైస్కూల్‌లో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న జక్కుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీవైఎస్‌వోగా వ్యవహరించిన వెంకటేశ్వర్లు ఇటీవల ఉద్యోగ విరమణతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా యువజన క్రీడల అధికారిగా బాధ్యతలు స్వీకరించడంపై క్రీడా సంఘాల బాధ్యులు స్వామి, రాజేశ్, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కుష్ఠురహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠు రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. కుష్ఠు కేసుల నమోదులో భాగంగా నిక్షిత్–2 పాయింట్ జీరోపై డేటాఎంట్రి అపరేటర్లకు బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్లు ప్రొజెక్టర్ ద్వారా డెటా ఎంట్రీ నమోదును వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, 2027 నాటికి కుష్ఠురహిత దేశం లక్ష్యంగా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాయన్నారు. వైద్య సిబ్బంది సైతం క్షేత్రస్థాయిలో ఈ అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇప్పటికే ఎస్‌సీడీసీ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. అదే తరహాలో కుష్ఠు కేసులను గుర్తించి వాటిని నిక్షిత్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. స్పర్శ లేని మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం వామన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బల్దియా దిద్దుబాటు చర్యలు

- ముగ్గురు ఆర్‌ఐలకు సెక్షన్ల మార్పు

కైలాస్‌నగర్:ఆదిలాబాద్ మున్సిపల్ రెవెన్యూ విభాగంలో చోటు చేసుకున్న అక్రమాలపై బల్దియా అధికారులు ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించారు. పట్టణంలోని బల్దియా లీజు స్థలాలకు కొంత మంది నకిలీ పత్రాలు సృష్టించి రెవెన్యూ విభాగం సిబ్బంది సహకారంతో దొడ్డి దారిన ఇంటినంబర్లు పొందారు. అలాగే విలీన కాలనీలు, శివారు ప్రాంతాల్లో ఇటీవల దొడ్డిదారిన అసెస్‌మెంట్లు చోటు చేసుకున్నాయి. అక్రమ పట్టాలతో అనర్హులకు ఇంటి నంబర్లు కేటాయించగా.. వాటి ఆధారంగా అక్రమార్కులు రిజిస్ట్రేషన్లు చేసుకొని కోట్లాది రూపాయల విలువైన స్థలాలను హస్తగతం చేసుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. అక్రమాలను వివరిస్తూ 'సాక్షి'లోనూ కథనాలు ప్రచురితయ్యాయి. దీనిపై స్పందించిన కమిషనర్ సీవీఎన్ రాజు అక్రమాలకు బాధ్యులుగా తేలిన ముగ్గురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై తాజాగా చర్యలు చేపట్టారు. శివప్రసాద్, వెంకటేశ్, నరేశ్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తూ కార్యాలయ విధులు అప్పగించారు.కాగా పన్ను వసూలు విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శోభతో పాటు ఇటీవల జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించిన జె.అజయ్, ఎ.అశోక్‌ను ఆర్‌ఐలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారు త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు. ఇదిలా ఉంటే విలీన కాలనీల్లో అక్రమంగా అసెస్‌మెంట్లు జరిగినా ప్రస్తుతం కొనసాగుతున్న ఏరియాకు సంబంధించిన ఆర్‌ఐని విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- భోరజ్ మండలం పిప్పర్‌వాడ గ్రామంలో రూ.11లక్షల స్త్రీనిధి రుణాలను వీవోఏ సభ్యుల ఖాతాల్లో జమ చేయకుండా పక్కదారి పట్టించారు. ఆ నిధులను దుర్వినియోగం చేస్తూ తమ సొంతానికి వాడుకున్నారు. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు వీవోఏతో పాటు మండలంలోని సీసీలపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.
- గుడిహత్నూర్ మండల కేంద్రంలో రూ.37లక్షల నిధులను వీవోఏ దుర్వినియోగం చేశారు. ప్రతినెలా సభ్యులు చెల్లించిన కిస్తీలను వారి ఖాతాల్లో జమచేయకుండా సొంతంగా వాడుకున్నారు. అక్రమాలు బయటపడినా ఇప్పటివరకు సంబంధిత వీవోఏ, సీసీ నుంచి ఎలాంటి రికవరీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.
- తాంసి మండలం హస్నాపూర్ స్వయం సహాయక సంఘాల పరిధిలో రూ.8లక్షల గోల్‌మాల్ చోటుచేసుకుంది. సభ్యుల వాయిదాలను బ్యాంక్ ఖాతాలో జమ చేయాల్సిన వీవోఏ పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకున్నారు. రికవరీ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామంలోని సభ్యులకు అన్యాయం జరుగుతుంది.

స్వాహాపై మౌనమేలా!

- స్త్రీనిధి రుణం.. అక్రమాలమయం
- సభ్యుల ఖాతాల్లో జమకాని నగదు
- చేతివాటం ప్రదర్శిస్తున్న వీవోఏలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రికవరీపైనా పట్టింపు కరువు



కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి రుణాలు అందజేస్తోంది. చిరు వ్యాపారాలతో స్వయం ఉపాధి సాధించాలనే ఉద్దేశంతో రుణాలను మంజూరు చేస్తుంది. వాటిని సద్వినియోగం చేసుకొని రాణించాల్సిన మహిళలకు క్షేత్రస్థాయిలోని సిబ్బంది ద్వారా అవరోధం కలుగుతుంది. సభ్యులు చెల్లించిన నెలవారీ కిస్తీల నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సిన వీవోవోలు పక్కదారి పట్టిస్తున్నారు. తమ సొంత ఖాతాలకు మళ్లించుకొని సంఘ సభ్యులకు బురిడీ కొట్టిస్తున్నారు. ఆలస్యంగా ఈవ్యవహారం వెలుగు చూస్తుండంతో చేసేదేమి లేక నష్టపోవాల్సిన పరిస్థితి. జిల్లాలో ఇలా రూ.కోట్లలో అక్రమాలు చోటుచేసుకోవడం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోంది.

ఏటా ఇదే తంతు..
జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో అర్హత సాధించిన సంఘాలకు ప్రభుత్వం స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తుంది. రూ.30వేల నుంచి రూ.2లక్షల వరకు అందజేస్తూ వారు స్వయం ఉపాధితో రాణించేలా ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఏటా రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల రుణాలను సభ్యులకు అందజేస్తుంది. అయితే కొన్ని సంఘాలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధిస్తుండగా, మరికొన్ని సంఘాల్లో మాత్రం అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. రుణాలు పొందిన సభ్యులు ప్రతి నెలా కిస్తీలు సక్రమంగా చెల్లిస్తున్నప్పటికీ వాటిని బ్యాంకుల్లో జమ చేయాల్సిన వీవోఏలు పక్కదారి పట్టిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ నిధులను తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. కొందరు అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్నారు. మరికొంత మంది ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాలు ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు.

బాధ్యులపై చర్యలేవి..?
గ్రామంలోని స్వయం సహాయక సంఘాలకు మంజూరైన నిధులు, చెల్లించాల్సిన కిస్తులు, రికవరీని పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత సీసీలపై ఉంటుంది. అయితే వీవోఏలు దుర్వినియోగం చేసిన నిధులు ఇప్పటివరకు సంబంధిత మహిళా సంఘాల ఖాతాల్లో జమ కావడం లేదు. ఇందుకు బాధ్యులైన సీసీలపై చర్యలు తీసుకోవాల్సిన డీఆర్డీఏ అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాల్సిందిపోయి 'మామూలు'గా వ్యవహరించడం ఏంటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీ, లక్ష్యసాధనను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రీజినల్ మేనేజర్‌ను నియమించింది. వాటిపై నిరంతరం పర్యవేక్షిస్తూ సంఘాలకు అండగా నిలవాల్సిన సదరు అధికారి ఎప్పుడు ఎక్కడ

ఆ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు

ఉంటారో తెలియని పరిస్థితి. అదనపు ఆర్‌ఎం ఉన్నప్పటికీ సదరు అధికారిదీ అదే పరిస్థితి. సంఘాలపై పర్యవేక్షణ కొరవడడంతో ఇలా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే వీవోఏలు, సీసీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారి తీరుపై సంఘాల సభ్యులే కాదు సాక్షాత్తు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సైతం ఆగ్రహంగా ఉన్నట్లు ఆ శాఖ ఉద్యోగులే బాహటంగా విమర్శలు గుప్పిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన పేరిట విధులకు గైర్హాజరయ్యే సదరు అధికారి జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో అసలు కనిపించరని ఆ శాఖ అధికారే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం పరిస్థితికి అద్దం పడుతుంది. ఈ విషయమై స్త్రీనిధి జిల్లా మేనేజర్‌ను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఫోన్ కట్ చేయడం గమనార్హం. డీఆర్డీవోను సంప్రదించగా అదనపు డీఆర్డీవోను సంప్రదించాలని పేర్కొనడం వారి మధ్య విబేధాలకు అద్దం పడుతుంది.

రికవరీపై ప్రత్యేక దృష్టి
జిల్లాలో స్త్రీ నిధి రుణ చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై దృష్టి సారించాం. సోషల్ ఆడిట్ సీఆర్‌పీల నుంచి మండలాల వారీగా ప్రత్యేక నివేదికలు తెప్పించుకుంటున్నాం. వాటి ఆధారంగా క్షేత్రస్థాయికి వెళ్లి సంఘాల సభ్యులతో విచారణ చేస్తున్నాం. అక్రమాలకు బాధ్యులైన వారు స్వాహా చేసిన మొత్తాన్ని చెల్లించాలని సూచిస్తున్నాం. నిర్ణీత గడువు విధిస్తున్నాం. సకాలంలో చెల్లించకుంటే బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ముందుకు వెళ్తాం. ఎవరినీ ఉపేక్షించబోం.
– జాదవ్ గోవింద్‌రావు, అదనపు డీఆర్‌డీఓ

సేంద్రియం.. రైతుకు సాయం

- వినియోగిస్తే లాభాలెన్నో..
- జిల్లాలో అందుబాటులో ఎరువు
- అన్నదాతకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ



కంపోస్ట్ ఎరువును పరిశీలిస్తున్న రైతులు (ఫైల్)

జిల్లాలో అందుబాటులో ఉన్న ఎరువులు

ఎరువు రకం	అందుబాటులో ఉన్నది (మెట్రిక్ టన్నుల్లో)
యూరియా	25,374
డీఏపీ	4,843
ఎంవోపి	1,047
ఎస్‌ఎస్‌పీ	1,786
కాంప్లెక్స్ ఎరువులు	23,665
సేంద్రియ ఎరువు	800

ఆదిలాబాద్‌అర్బన్: అన్నదాతలను అప్పుల ఊబిలోకి లాగుతున్న వాటిలో రసాయన ఎరువులు ప్రధానమైనవి. మోతాదుకు మించి వాడడం, భూసారం తగ్గిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా చేసిన అప్పులు తీరక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు వ్యవసాయ శాఖ సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నా ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. ప్రస్తుతం ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 5.85 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కొంత మంది రైతులు ఇప్పటికే విత్తనాలు విత్తగా, మరికొంత మంది సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే ఈ సారైన రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియంపై దృష్టి సారిస్తారా.. లేదా అనేది చూడాలి.

సేంద్రియ సాగుతో లాభాలెన్నో..
సేంద్రియ ఎరువుల వాడకం వలన పంటలను చీడపీడల బెడద నుంచి తప్పించడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చు. పెట్టుబడి కూడా తగ్గుతుంది. ఆరుతడి, కూరగాయల సాగుకు ఎంతో ఉపయోగపడుతాయని అధికారులు సూచిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా తయారవడంతో భూసారం సైతం పెరుగుతుంది. పశువుల పేడ, వానపాములు, ఆకులు, తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారు చేసుకోవచ్చనివ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అయితే రైతులకు అవసరమైనప్పుడల్లా రసాయన ఎరువులు అందుబాటులో ఉండడంతో సేంద్రియంపై శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది.

ఈ సారైనా రసాయన ఎరువులు తగ్గేనా..?
జిల్లాలో ప్రస్తుతం మార్కెట్ నిండా రసాయన ఎరువులున్నాయి. వ్యవసాయశాఖ సైతం ఎరువులను మండలాలు, గ్రామాల వారీగా సరఫరా చేసి రైతులకు అందుబాటులో ఉంచింది. ఏటా మాదిరిగానే ఈ సారి కూడా అన్నదాతలు వాటికే ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గడంతో పాటు పెట్టుబడి వ్యయం పెరిగి రైతులు అప్పుల పాలవుతున్నారు. పర్యావరణంపైనా ప్రభావం చూపుతుంది. వీటిని అధిగమించాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం ఒక్కటే మార్గమని అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఇప్పటికే అవగాహన సదస్సులు సైతం నిర్వహిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం.
సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయన ఎరువులు అధికంగా వాడితే భూసారం తగ్గి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అదే సేంద్రియ ఎరువు వాడితే భూసారం పెరగడంతో పాటు మంచి దిగుబడి వచ్చే ఆస్కారం ఉంటుంది. రైతులతో ఏర్పాటు చేసిన ఆయా కమిటీల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.
– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

'ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే కుట్ర'



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న సోయం బాపూరావు

కైలాస్‌నగర్: ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసేందుకు కేంద్రం కుట్రలుచేస్తుందని మాజీ ఎంపీ సోయం బాపూరావు ఆరోపించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 49తో ఆదివాసీలకు అన్యాయం జరగకుండా చూడాలని వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ భూములను సాగు చేయనీయకుండా, టైగర్ జోన్లు, కంజర్వేషన్, రిజర్వ్‌డ్, అటవీప్రాంతాల పేరిట సిర్పూర్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో దాదాపు 250 గ్రామాల్లోని ఆదివాసీలను అడవులనుంచి వెళ్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఆదివాసీలకు న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సోయం పేర్కొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- కలెక్టర్ రాజర్షి షా



పిప్రిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

బజార్‌హత్నూర్: ఇందిరమ్మ పథకంలో భాగంగా ప్రతీ పేదవాడికి సొంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దత్తత గ్రామమైన మండలంలోని పిప్రి గ్రామంలో బుధవారం 17 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఈటీఐ (గ్రామీణ అభివృద్ధి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ)ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన 35 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. అక్కడి నుండి టెంబి, అనంతపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. రైతులు భూభారతి చట్టం ద్వారా భూసమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతపూర్ గ్రామస్తులు అంగన్‌వాడీ భవనం, పంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్‌సింగ్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ డీఎం పద్మభూషణ్, ఉత్తం కుమార్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ మహ్మద్ గౌస్, హీరాలాల్, విద్యాసాగర్, నూర్‌సింగ్ పాల్గొన్నారు.

వండుకుంటున్నారా.. అమ్ముకుంటున్నారా?

- రేషన్ లబ్ధిదారులను అడిగిన సివిల్ సప్లై ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి
- సన్నబియ్యం వినియోగంపై ఆరా
- చౌక ధరల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి

కైలాస్‌నగర్: మూడు నెలల రేషన్ కోటాను కార్డుదారులకు ఒకేసారి పంపిణీ చేస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై సివిల్ సప్లై రాష్ట్ర విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆ విభాగం ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించారు. జిల్లా కేంద్రంతో పాటు జైనథ్ మండలంలోని పలురేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి సన్నబియ్యం నాణ్యత, వినియోగంపై ఆరా తీశారు. తూకంలో ఏమైనా తేడాలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బియ్యంను వండుకుంటున్నారా.. లేదా అమ్ముకుంటున్నారా అనే దానిపై పలువురు కార్డుదారులను ప్రశ్నించారు. అయితే తామంతా నిరుపేదలమేనని సన్న బియ్యం బాగున్నాయని వాటిని వండుకుని తింటున్నామని చెప్పారు. అనంతరం నాణ్యత పరిశీలన కోసం బియ్యం శాంపిల్స్ సేకరించారు. కాగా, తమ వద్ద మిగిలిన దొడ్డుబియ్యం కారణంగా సన్నబియ్యం నిల్వ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని డీలర్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఒకే కార్డుదారు ఆరుసార్లు వేలిముద్ర వేయాల్సి రావడంతో పంపిణీలో ఆలస్యం అవుతుందని వివరించారు. ఆయన వెంట డీఎస్‌వో వాజీద్ అలీ, డీఎం సుధారాణి, డీటీ రాథోడ్ బాబుసింగ్ తదితరులున్నారు.

ప్రభుత్వ బడి బలోపేతమే లక్ష్యం

- ప్రైవేట్‌కు దీటుగా వసతుల కల్పన
- డిజిటల్, ఏఐ ద్వారా విద్యాబోధన
- 'బడిబాట'పై స్పెషల్ ఫోకస్
- టీచర్ల సర్దుబాటుకు కసరత్తు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.. ప్రైవేటుకు ధీటుగా అన్ని వసతులు అందుబాటులో ఉంచుతున్నాం.. డిజిటల్ తరగతులు, ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా కూడా విద్యాబోధన అందిస్తున్నాం. గతేడాదితో పోల్చితే ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచడంపై ఫోకస్ పెంచాం.. బడిబాటను పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశాం.. నాణ్యమైన బోధనే లక్ష్యంగా ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ సైతం పూర్తి చేశాం.. పాఠశాల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.. అని డీఈవో ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకుంటున్న చర్యలేంటి?
డీఈవో: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. మరింత నాణ్యమైన విద్యాబోధన కోసం వారికి ఈ వేసవిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ ద్వారా బోధన, ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులతో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందిస్తున్నాం. మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్స్, కంప్యూటర్ విద్యతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తూ వారి హాజరు పెంచేందుకు కృషి చేస్తున్నాం.
సాక్షి: విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు..?
డీఈవో: బడిబాట కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తూ విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ప్రోత్సహిస్తున్నాం. గతేడాది ప్రవేశాలు తగ్గిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం ఉంటుంది. దీనిని పకడ్బందీగా అమలు చేసేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.
సాక్షి: పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారు..?
డీఈవో: పాఠశాలల్లో సమస్యలు లేకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆయా మండల విద్యాధికారులు, ఉపాధ్యాయుల ద్వారా అవసరమైన మౌలిక వసతుల వివరాలను సేకరించాం.వాటిని ఉన్నతాధికారులకునివేదించాం.నిధులు మంజూరు రాగానే పనులు చేపడతాం.అలాగే విద్యా ప్రమాణాలపై పర్యవేక్షణ పెంచాం.
సాక్షి: జిల్లాలో మూతబడిన పాఠశాలలను తెరిచేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?
డీఈవో: జిల్లాలో 12 పాఠశాలలు మూతబడ్డాయి. వీటిలో ఒక ఉన్నత పాఠశాల ఉంది. ప్రస్తుతం బడిబాట లో భాగంగా నాలుగు ప్రాథమిక పాఠశాలలను తెరిచేందుకు చర్యలు చేపడుతున్నాం. నేరడిగొండ, నార్నూర్‌లో ఒక్కోటి చొప్పున, ఆదిలాబాద్‌అర్బన్‌లో 2 పాఠశాలలు పునఃప్రారంభించేలా చూస్తున్నాం. ఈ పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులను నియమిస్తాం.
సాక్షి: జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉందా.. సర్దుబాటు చేపడుతున్నారా..?
డీఈవో: మెగా డీఎస్సీ ద్వారా జిల్లావ్యాప్తంగా 236 పోస్టులు భర్తీ అయ్యాయి. జిల్లాలో మొత్తం 3067 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు ఉండగా, 2,667 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 400 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్దుబాటు చేపడతాం. ఈమేరకు వివరాలు పంపించాలని ఎంఈవోలను ఆదేశించాం. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ ప్రక్రియ ఉంటుంది. సర్‌ప్లస్ ఉన్నచోట ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేస్తాం.
సాక్షి: తల్లిదండ్రులకు మీరిచ్చే భరోసా ఏమిటి..?
డీఈవో: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారు. అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన బోధన అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్ల లను ప్రభుత్వ బడుల్లో చేర్పించి వారి భవిష్యత్తును మెరుగుపర్చాలి. అందరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తాం.

సాక్షి: గతేడాది యూనిఫాం, పాఠ్య పుస్తకాల పంపిణీలో జాప్యం జరిగింది. ఈ ఏడాది ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?
డీఈవో: పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో 62,282 మంది విద్యార్థులున్నారు. మొదటగా ఒక జత ఇస్తాం. 45 శాతం కుట్టు పని పూర్తయ్యింది. జిల్లాకు 4లక్షల 83వేల 110 పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా, ఇప్పటి వరకు 4లక్షల 65వేల 221 వచ్చాయి. 3లక్షల 72వేల 200 పుస్తకాలను ఎంఈవో కార్యాలయాలకు పంపించాం. మండల విద్యాధికారులు 2లక్షల 79వేల 150 పుస్తకాలను ఆయా పాఠశాలలకు సరఫరా చేశారు.

క్లుప్తంగా

వెదురు తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌లు పట్టివేత



రేంజ్ కార్యాలయంలో ఐచర్ వ్యాన్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధి నుంచి మంగళవారం రాత్రి వెదురు తరలిస్తున్న రెండు ఐచర్ వ్యాన్‌లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలం ఇస్లాంపూర్ నుంచి వెదురులోడ్‌తో రెండు వ్యాన్‌లు వస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు డీఆర్‌వో మమత, బీట్ అధికారులు లాలుబాయి, తిరుమలేశ్‌లు కిష్టాపూర్ సమీపంలో తనిఖీలు చేపట్టి ఐచర్‌వ్యాన్‌లను పట్టుకుని జన్నారం రేంజ్ కార్యాలయానికి తరలించారు. కాగా తాము అన్ని అనుమతులు పొందామని డ్రైవర్ శేఖర్ తెలపడంతో అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ విషయమై రేంజ్ అధికారి సుష్మారావును సంప్రదించగా పర్మిట్‌పై విచారణ చేపడుతున్నామన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలో మంగళవారం ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాసరకు చెందిన బాలాపురం లక్ష్మీనారాయణ రావు అనే యువకుడు బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తుండగా నర్సాపూర్ (జి) గ్రామ శివారు 61వ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో యువకుడికి గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాడిదకు అరుదైన శస్త్రచికిత్స

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో నివసించే మీనాబాయికి చెందిన గాడిదకు బుధవారం జిల్లా కేంద్రంలోని పశువైద్యశాల వైద్యులు డాక్టర్ గజానన్, డాక్టర్ దూద్‌రామ్ రాథోడ్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపికిషన్‌లు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గాడిదకు చెందిన పిండం తల పెద్దగా ఉండి, మిగితా అవయవాలు అపరిపక్వంగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు జన్యులోపం కారణంగా ఇలా జరుగుతుందని పేర్కొన్నారు. శస్త్రచికిత్సలో సిబ్బంది సాజిద్ అలీ, అమీన్, ఖాజా పాషా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ.. భర్త అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శ్రీరామ్ కాలనీకి చెందిన భోజన్న అనే వ్యక్తి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గత నెల 27న ఇంట్లో భార్య దాసరి విజయతో గొడవ చోటుచేసుకుంది. దీంతో ఆయన భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. 29వ తేదీన తిరిగి రాగా భోజన్న కనిపించకుండా పోయాడు. దీంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం..

పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన 20 ఏళ్ల యువతి అదృశ్యమైంది. ఓ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని తండ్రి కలెక్టర్ చౌక్‌లో మంగళవారం ఉదయం వదిలిపెట్టి వెళ్లాడు. కళాశాలకు వెళ్లిన యువతి రాత్రి వరకూ తిరిగి రాలేదు. దీంతో యువతి తండ్రి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

పర్యావరణమే పరమౌషధం!



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులు(ఫైల్)

- జిల్లాలో తగ్గుతున్న అటవీ విస్తీర్ణం
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పచ్చని చెట్లతోనే మనుగడ
- ప్రకృతి పరిరక్షణకు కొందరి ప్రయత్నం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం లక్షల హెక్టార్లలో ఉండేది. టేకు మద్ది, వెదురు తదితర వృక్ష జాతులతో దట్టమైన అడవులు విస్తరించి ఉండేవి. పోడువ్యవసాయంతో పాటు పెరుగుతున్న జనాభాకనుగుణంగా పట్టణ ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. కలప వినియోగం కూడా పెరిగిపోవడంతో అడవులు కనుమరుగవుతున్నాయి. క్రమేణ అడవుల శాతం తగ్గుతుండడంతో ప్రకృతి ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు వర్షాలు కురుస్తున్నా, మరోవైపు విపరీతమైన ఉక్కపోత, తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రకృతిలో అసమతుల్యతకు ప్రధాన కారణం పర్యావరణంలో పచ్చదనం లోపించడమే.

జిల్లా	అటవీ విస్తీర్ణం (హెక్టార్లలో)..
నిర్మల్	1,21,660
ఆదిలాబాద్	1,72,473
మంచిర్యాల	1,76,473
కుమరంభీమ్	2,44,540
మొత్తం	7,15,146

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. దానిని విధ్వంసం చేసే హక్కు ఎవరికీ లేదు. అన్ని జీవులతో పాటు మనిషి జీవనంలో భాగంగా ప్రకృతి మనుగడ కోసం పాటుపడాలి. మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించుకోవడం వల్ల భావితరాలకు సమతుల్యతతో కూడిన పర్యావరణాన్ని అందించగలుగుతాం.

– మహమ్మద్ నజీర్‌ఖాన్, డెప్యూటీ అటవీ క్షేత్రఅధికారి, సారంగపూర్

సహజ సిద్ధంగా ఏర్పడిన అడవులు, పచ్చని పరిసరాలను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని పర్యావరణవేత్తలు భావిస్తున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్న కొందరిపై ప్రత్యేక కథనం..

మొక్కల పెంపకంపై మక్కువ..



గింజలు నాటుతున్న పవన్‌కుమార్



పండ్ల విత్తనాలు

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన బి. పవన్‌కుమార్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ప్రకృతి సంరక్షణ, మొక్కల పెంపకంపై అమితమైన మక్కువ ఉంది. తన వంతు బాధ్యతగా పచ్చదనం పెంపొందించడానికి వినూత్నంగా ఆలోచించాడు. ప్రతీరోజు తిని పారవేసే వివిధ రకాల పండ్లలోని గింజలను ఎండబెట్టి భద్రపరుస్తాడు. వర్షాకాలం ప్రారంభంలో భద్రపర్చిన దాదాపు 10 కిలోల వరకు వివిధ రకాల పండ్లు, కాయలు తదితర విత్తన గింజలను అటవీ ప్రాంతంలో మట్టి తీసి నాటుతున్నాడు. ఏటా వర్షాకాలంలో సపోటా, మామిడి, బత్తాయి, అల్బుకార్, అల్లనేరేడు, సీతాఫలం తదితర విత్తనాలను మిత్రులతో కలిసి గుంతలు తీసి నాటుతున్నాడు. మరికొన్ని విత్తనాలను సీడ్ బాల్స్‌గా తయారుచేసి అడవిలో దూరంగా విసురుతుంటారు. ఇందులో 20శాతం మొక్కలు పెరిగినా తనకు సంతృప్తినిస్తుందని పవన్‌కుమార్ చెబుతున్నాడు.

పర్యావరణహిత బ్యాగులు..



విక్రయకేంద్రంలో క్యారీబ్యాగులతో తాన్న లక్ష్మి

పర్యావరణహితమైన క్యారీ బ్యాగులను సమాజానికి అందించాలనే లక్ష్యంతో డీఆర్డీవో (భారత రక్షణ పరిశోధన సంస్థ) సాంకేతిక సహకారంతో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తాన్న లక్ష్మి అనే మహిళ బయోడీగ్రేడబుల్(మట్టిలో సహజంగా కుళ్లిపోయే) సంచుల విక్రయశాల నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రజలను, వినియోగదారులను తన వంతుగా చైతన్యపరుస్తోంది. దీన్ని లాభసాటి వ్యాపారంగా కాకుండా ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమంగా భావించి జిల్లాకేంద్రంలో అవుట్‌లెట్ విక్రయకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లను కలిసి ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరిస్తూనే ఈ బయోడీగ్రేడబుల్ క్యారీ బ్యాగులను వినియోగించాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్యారీ బ్యాగులు కేవలం 30 రోజులలోపే భూమిలో కరిగి సేంద్రియ ఎరువుగా మారుతాయి.



నేలలో కరిగిపోయే క్యారీబ్యాగులు

తాత్కాలికంగా పలు రైళ్ల రద్దు

బెల్లంపల్లి: కాజీపేట్ సబ్ డివిజన్ పరిధి బెల్లంపల్లి -రేచ్నీరోడ్ రైల్వేస్టేషన్ సెక్షన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు చేపట్టిన నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసి, మరికొన్ని రైళ్ల హాల్టింగ్‌ను తాత్కాలికంగా రైల్వేశాఖ ఎత్తివేసింది. రద్దు, హాల్టింగ్‌ల ఎత్తివేత ప్రక్రియ ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అమలులో ఉంటుంది. కాజీపేట్ -సిర్పూర్ కాగజ్‌నగర్ ప్యాసింజర్, బల్లార్షా -కాజీపేట్, సికింద్రాబాద్ -సిర్పూర్ కాగజ్‌నగర్‌ఎక్స్‌ప్రెస్, భద్రాచలంరోడ్ -బల్లార్షా రైళ్లు రద్దు కాగా సికింద్రాబాద్ -సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ -సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంచిర్యాల వరకు నడుపనున్నారు. మైసూర్ -జైపూర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ -న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -దానాపూర్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి -హజ్రత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలికంగా బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

కాజీపేట్ -బల్లార్షా మధ్య..

కాగజ్‌నగర్‌టౌన్: కాజీపేట్ -బల్లార్షా మధ్య పలు రైళ్లను ఈ నెల 20 వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ సీవోఎం కె. మణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ -సిర్పూర్, కాజీపేట్ -సిర్పూర్, సికింద్రాబాద్- కాగజ్‌నగర్, కరీంనగర్ -బోధన్, గోరఖ్‌పూర్- త్రివేండ్రంతో పాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి, రేచినిరోడ్ మధ్యలో థర్డ్‌లైన్ పనులు జరుగుతున్నందున రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఐపీఎల్ బెట్టింగ్.. ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఐపీఎల్ మ్యాచ్‌కు ఆన్‌లైన్ బెట్టింగ్ చేసిన ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. మంగళవారం ఐపీఎల్ మ్యాచ్‌లో పట్టణంలోని కల్పనబార్‌లో పనిచేసే మంచాల నిఖిల్ రెడ్డి ఆన్‌లైన్‌లో రూ.4,500 బెట్టింగ్ పెట్టాడు. బట్టిసావర్గాంకు చెందిన ముస్తాల సాయిమహేశ్, వెంకట్‌లు వరుసగా రూ.2,200, రూ.1,400 ఆన్‌లైన్ బెట్టింగ్ చేయగా పట్టుకుని వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లో రైలు ఢీకొని మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. వడ్యాల్ గ్రామానికి చెందిన భీమన్న(55) గతంలో గ్రామంలో పశువుల కాపరిగా పని చేసేవాడు. ఈ సంవత్సరం జీవనోపాధి కోసం మేస్త్రీ పని చేసేందుకు హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం పని కోసం వెళ్లే క్రమంలో హైదరాబాద్‌లోని నాంపల్లిలో రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తల, ముఖానికి తీవ్ర గాయాలైన భీమన్న అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి ఆధార్‌కార్డు సహాయంతో కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా విషయం తెలియజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు, అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో గ్రామానికి చెందిన పలువురు యువకులు, ఇంటి చుట్టుపక్కల వారు విరాళాలు సేకరిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



భీమన్న (ఫైల్)

చెట్టుమీద పడి ఒకరు..

దండేపల్లి: చింతచెట్టును రంపం మిషన్‌తో కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు మీద పడి కూలీ మృతి చెందిన ఘటన దండేపల్లి మండలం కన్నెపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లికి చెందిన ఇండ్ల ఆశయ్య(65) గ్రామంలోని ఓ ఇంటి పెరటిలో గల చింతచెట్టును మరో ఇద్దరు కూలీలతో కలిసి రంపం మిషన్‌తో కోస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా చెట్టు విరిగి ప్రమాదవశాత్తు ఆశయ్యపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతుడి కుమారుడు భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



ఆశయ్య (ఫైల్)

రోటోవేటర్ కిందపడి ఒకరు..

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామంలో మంగళవారం రాత్రి బాసర మండలం టాక్లి గ్రామానికి చెందిన పిక్లెకర్ దత్తు (45) అనే వ్యక్తి ట్రాక్టర్ రోటోవేటర్ కింద పడి మృతిచెందినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. సింగన్‌గాం గ్రామానికి చెందిన బొడ్కె సాయినాథ్ అనే యువకుడు గత ఐదేళ్లుగా దత్తు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి డ్రైవర్ సాయినాథ్ భూమిని చదును చేసేందుకు దత్తుతో కలిసి సింగన్‌గాం గ్రామానికి చేరుకున్నారు. చదును చేస్తున్న క్రమంలో ట్రాక్టర్‌పై కూర్చున్న దత్తు ప్రమాదవశాత్తు రోటోవేటర్ కింద పడి మృతిచెందాడు. విషయాన్ని డ్రైవర్ సాయినాథ్ దత్తు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. బుధవారం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఏఎస్సై భానుప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. దత్తు భార్య అనుషాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రిమ్స్‌లో చికిత్స పొందుతూ యువతి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా సుంగగూడకు చెందిన గంగాసాగర్ (20) అనే యువతి రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇంట్లో ఉండి ఏ పనులు చేయకపోవడంతో తండ్రి మందలించగా మనస్తాపానికి గురైన యువతి పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఆయన పేర్కొన్నారు.

అంబులెన్స్ ఆలస్యం.. గర్భిణీ మృతి

ఉట్నూర్‌రూరల్: 108 అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో ఎనిమిది నెలల గర్భిణీ గుండెపోటుతో మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన గర్భిణీ కుర్సెంగ తారాబాయి (26)కి ఆదిలాబాద్ చింతలబోరికి చెందిన మాన్కుతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భిణీ. బుధవారం దంతన్‌పల్లి పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంది. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. గంట ఆలస్యంగా వచ్చిన అంబులెన్స్ సిబ్బంది ఆమెను పరీక్షించి ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రి వైద్యులు పరీక్షించి గుండెపోటుతో తారాబాయి మృతి చెందినట్లు తెలిపారు. 108 అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే గర్భిణీ బతికి ఉండేదని కుటుంబ సభ్యులు రోధిస్తూ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గర్భిణుల కోసం ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



తారాబాయి (ఫైల్)

నిషేధిత కలుపు మందు పట్టివేత

నార్నూర్: మహారాష్ట్రలోని జివితి గ్రామం నుంచి అక్రమంగా తీసుకొస్తున్న నిషేధిత కలుపు మందు (రౌండప్)ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై జీవన్‌రెడ్డి, ఏవో వెంకన్నలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు మహారాష్ట్రలోని జివితి ప్రాంతం నుంచి నిషేధిత కలుపు మందు నాలుగు కాటన్‌లలో మొత్తం 32 బాటిళ్లు తరలిస్తుండగా, గాదిగూడ మండల కేంద్రంలో పట్టుకున్నట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేస్తామన్నారు.

ఉరేసుకుని యువరైతు ఆత్మహత్య

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన ఓ యువ రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుస్లీ గ్రామానికి చెందిన బొగడమీది గంగారాం (35) అనే యువరైతు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 14 సంవత్సరాల క్రితం వెంకూర్ గ్రామానికి చెందిన మీనాతో వివాహమైంది. గత నెల క్రితం భార్యభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక తన భార్య రాదేమోననే బెంగతో జీవితంపై విరక్తి చెందిన గంగారాం మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మృతుడి తండ్రి బొగడమీది గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గంగారాం (ఫైల్)

'నవోదయ'ం పిలుస్తోంది..!

- 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- సీటు సాధిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

నవోదయ ప్రవేశపరీక్ష వివరాలు..
జిల్లాలో మొత్తం సీట్లు: 80
గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 60
పట్టణ ప్రాంత విద్యార్థులకు 20
దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 27
ప్రవేశపరీక్ష: డిసెంబర్ 13



నవోదయ విద్యాలయం

కాగజ్‌నగర్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి కాగజ్‌నగర్‌లో నవోదయ విద్యాలయం ఉంది. విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందేందుకు ఏటా విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతీ ఏడాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 5వేల మందికి పైగా విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు. జవహర్ నవోదయలో సీటు సాధిస్తే క్రమశిక్షణతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని, తద్వారా పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడుతాయని తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రవేశపరీక్ష రాయిస్తున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధిక సీట్లు..

విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా కేంద్రం కొన్ని దశాబ్దాల క్రితమే దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు. ప్రవేశ పరీక్ష ల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి 2026 -2027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో సీటు లభిస్తుంది. దరఖాస్తుకు చివరి తేదీ జూలై 27 కాగా, డిసెంబర్ 13న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. అర్హత సాధించి సీటు పొందిన విద్యార్థులకు 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌లో ఉచితంగా విద్య అందిస్తారు. 6వ తరగతిలో 80 సీట్లు ఉండగా.. 60సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తుండగా, 20సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులతో భర్తీ చేస్తారు. బాలికలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్తగా నిబంధనలు చూసి తప్పులు లేకుండా, గడువులోగా దరఖాస్తులు చేసుకోవాలి.

– కొడాలి పార్వతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం, కాగజ్‌నగర్



కాలేజీకి వెళ్లాల్సిన కొడుకు కాటికి..!

- స్నేహితులతో సరదాగా గడిపేందుకు ఏసీసీ క్వారీకి..
- స్నానానికి క్వారీలోకి దిగిన ఇద్దరు స్నేహితులు
- నీట మునిగి ఒకరు మృత్యువాత



మృతుడు హర్షిత్ (ఫైల్)



రోదిస్తున్న హర్షిత్ తల్లిదండ్రులు

మంచిర్యాలక్రైం: మరొక్క రోజు గడిస్తే కొడుకు కాలేజీకి వెళ్తాడని తల్లిదండ్రులు అంతా సిద్ధం చేశారు. పదో తరగతి పూర్తి చేసిన తనయుడిని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఇంటర్మీడియెట్ కళాశాలలో చేర్పించేందుకు ఫీజు కూడా చెల్లించారు. స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు ఏసీసీ క్వారీకి వెళ్లిన విద్యార్థి.. స్నానానికి క్వారీలోకి దిగి మృత్యువాత పడ్డాడు. కాలేజీకి వెళ్తాడనుకుంటే కనిపించకుండా పోయాడంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారికి కలిచివేసింది. ఈ సంఘటన మంచిర్యాల పోలీసుస్టేషన్ పరిధిలోని ఏసీసీ క్వారీ వద్ద చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని జాఫర్‌నగర్‌లో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి సాదుల ప్రసాద్ నివాసం ఉంటున్నాడు. ఆయన భార్య లావణ్య కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు హర్షిత్ (15), ధనుష్ ఉన్నారు. హర్షిత్‌ను హైదరాబాద్‌లోని పాఠశాలలో చదివించారు. ఇటీవల పదో తరగతి పూర్తి చేయగా ఇంటర్ కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో చేర్పించారు. ఈ నెల 5న కాలేజీకి వెళ్లాల్సి ఉండగా అన్ని ఏర్పాట్లు చేశారు.

స్నేహితులతో వెళ్లి..

హర్షిత్ చిన్ననాటి స్నేహితులు అందరూ పదో తరగతి పూర్తి చేసి వేర్వేరు కళాశాలల్లో చేరారు. గురువారం హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉండడంతో స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు మంగళవారం ఏసీసీ క్వారీకి వెళ్లారు. బిర్యానీ పార్టీ చేసుకుని ఫొటోలు దిగారు. స్నానం చేసేందుకు హర్షిత్‌తో పాటు మరో స్నేహితుడు క్వారీలోకి దిగారు. హర్షిత్ లోతుకు వెళ్లి నీట మునిగి చనిపోయాడు. గమనించిన స్నేహితులు భయంతో బయటకు వచ్చి ఏం చేయాలో తెలియక రోదిస్తూ వెళ్లిపోయారు. హర్షిత్ రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి ప్రసాద్ స్నేహితులను ఆరా తీయగా.. సాయంత్రం క్వారీకి వెళ్లినట్లు తెలిపారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా.. స్కూటీ, నీటిమడుగు పక్కనే డ్రెస్, చెప్పులు కనిపించాయి. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మంగళవారం రాత్రి కావడంతో బుధవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలించగా హర్షిత్ మృతదేహం లభించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్వారీ ప్రాంతంపై నిఘా పెంచాలి

ఏసీసీ క్వారీ దట్టమైన అటవీ ప్రాంతం. అత్యంత ప్రమాదకరమైన క్వారీ. పెద్ద పెద్ద నీటి మడుగులు ఉంటాయి. పైగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా రావు. ఏదైనా ప్రమాదం జరిగితే సమాచారం ఇవ్వడం కష్టమే. ఇంతటి ప్రమాదకరమైన ప్రాంతం వద్ద అధికారులు నిషేధం విధించారు. అయినా సరదాగా గడిపేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు ఏసీసీ క్వారీ అడ్డాగా మారిందని పలువురు చర్చించుకుంటున్నారు. ఏసీసీ క్వారీ ప్రాంతంపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని సీబాపు కాలనీలో మంగళవారం సాయంత్రం జరిగిన హత్య కేసులో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తెలిపారు. బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు చెందిన సయ్యద్ దావుద్ అలీతో పాటు మహ్మద్ షాహీద్, మహ్మద్ షాహీద్ హుస్సేన్‌లు సీబాపు కాలనీ సమీపంలో పెద్దవాగుకు వెళ్లే దారిలో బీర్లు తాగుతుండగా కాపువాడకు చెందిన షేక్ అక్బర్ అలియాస్ అబ్బు, షేక్ జమీర్, షేక్ అమీర్, దుర్వే రాఘవేంద్ర అలియాస్ అచ్చు, షేక్ రేయాన్, పోచమ్మ బస్తీకి చెందిన గిరిగుల రాజేశ్, సీబాపు కాలనీకి చెందిన గోగర్ల రూపేశ్‌లు దాడి చేయగా దావుద్ మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడు సయ్యద్ దావుద్ అలీ, మహ్మద్ షాహీద్ హుస్సేన్‌లతో నిందితులకు పాత కక్షలు ఉండడంతో దాడి చేశారని వివరించారు. నిందితుల నుంచి స్టీల్ కడియం, రక్తపు మరకలషర్ట్, బీరు సీసాలు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. షేక్ అక్బర్, షేక్ జమీర్, గోగర్ల రూపేశ్, రేయాన్‌లపై పలు స్టేషన్లలో ఇంతకు ముందు కేసులు ఉన్నాయన్నారు. సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై సందీప్ కుమార్‌లు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామానుజం